క్లుప్తంగా

పింఛన్ల పంపిణీ పేరుతో మోదీ సభకు ప్రచారం



భవానీపురం(విజయవాడపశ్చిమ): సామాజిక పింఛన్ల పంపిణీ సాకుతో ఇంటింటికీ తిరిగి శుక్రవారం అమరావతిలో జరుగనున్న ప్రధాని మోదీ సభకు భారీగా తరలి రావాలని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ చేస్తున్న ప్రచారం చూసి లబ్ధిదారులు నివ్వెరబోతున్నారు. గురువారం గొల్లపూడిలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితతోపాటు స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. పనిలో పనిగా వసంత కృష్ణప్రసాద్ అమరావతి పనుల పునఃప్రారంభానికి వస్తున్న ప్రధాని మోదీ కార్యక్రమానికి గొల్లపూడి గ్రామం నుంచి పెద్దఎత్తున తరలి రావాలని ప్రచారం మొదలు పెట్టారు. పైగా మైలవరం నియోజకవర్గం కూడా అమరావతిలో భాగమేనని లబ్ధిదారులతోపాటు ప్రజలకు చెప్పుకొచ్చారు. సందట్లో సడేమియా అంటే ఇదేనని ప్రజలు నవ్వుకుంటున్నారు. కార్యక్రమంలో బొమ్మసాని సుబ్బారావు, ఏఎంసీ చైర్మన్ నర్రా వాసు, నారద, అక్కల గాంధీ, నూతులపాటి బాల తదితరులు పాల్గొన్నారు.

షిర్డీ సాయి మందిరానికి విరాళం



తిరువూరు: స్థానిక మునుకుళ్ల రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న షిర్డీ సాయి మందిరానికి రిటైర్డు ఉపాధ్యాయుడు పొట్లూరి ఆంజనేయులు, ఆయన కుమార్తె, అల్లుడు సహజ, రాజేష్‌కన్నా రూ.20 వేల విరాళం అందజేశారు. మందిర ట్రస్టు అధ్యక్షుడు డీఎస్ఎస్ ప్రసాద్‌కు ఈ విరాళం సొమ్మును గురువారం అందజేశారు. సాయి సేవకులు అరుణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత యోగా శిక్షణ శిబిరం ప్రారంభం



ఇబ్రహీంపట్నం: ప్రతి రోజూ యోగా సాధన చేయడం ద్వారా ప్రశాంతమైన జీవనం అలవడుతుందని యోగా గురువు లంకే జనార్దన్ అన్నారు. శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఏకాలనీలో ఉచిత యోగా శిక్షణ శిబిరం గురువారం ప్రారంభమైంది. యోగా జీవనం సనాతన సంప్రదాయానికి, సంస్కృతికి నిదర్శనమన్నారు. యోగా సాధకులతో సూక్ష్మ వ్యాయామాలు, యోగాసనాలు, ధ్యానం, ప్రాణాయామం చేయించారు. తొలుత జి.సుబ్రహ్మణ్యం జ్యోతి ప్రజ్వలన చేసి యోగా శిబిరం ప్రారంభించారు. మున్సిపల్ కౌన్సిలర్ విజయలక్ష్మి, ఏఈఈ ఎ.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ముసునూరు: నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా చెక్కపల్లిలో సారా బట్టీలపై దాడి చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య గురువారం తెలిపారు. ఈ దాడుల్లో పామర్తి నాగరాజుకు చెందిన 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. బట్టీ యజమానిపై, బెల్లం సరఫరా చేస్తున్న హరికృష్ణపై కేసు నమోదు చేశామన్నారు. దాడిలో నూజివీడు ఎక్సైజ్ ఎస్ఐలు వై.ఈశ్వరరావు, ఎం.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ



తిరువూరు: స్థానిక గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో గురువారం వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు. గ్రంథాయాధికారి పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు నెమలి చిత్రం గీయడంపై పోటీలు నిర్వహించారు. గంపలగూడెం మండలం పెనుగొలను శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కథల పుస్తకాలు చదివించడం, నీతి కథలు చెప్పడం, చేతిరాతలో శిక్షణ, పేపర్ క్రాఫ్ట్ తయారీపై గ్రంథాలయాధికారి శ్రీలత శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులను వృథా చేసుకోకుండా శిక్షణ తరగతులకు హాజరు కావాలని కోరారు.

ఉక్కపోతతో విలవిల



ఇబ్రహీంపట్నం ఏకాలనీ సెంటర్ అంగన్‌వాడీలో చిన్నారులకు ఆటపాటలు నేర్పుతున్న అంగన్‌వాడీ టీచర్



ఇబ్రహీంపట్నం ఫెర్రీ శివాలయం వద్ద అంగన్‌వాడీలో చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్న ఆయా

- అంగన్‌వాడీలకు వేసవి సెలవులపై ప్రభుత్వం ఉదాసీనత
- ఇబ్బందులు పడుతున్న చిన్నారులు
- అంగన్‌వాడీలపై కక్షసాధింపు చర్యలు

ఇబ్రహీంపట్నం: అన్ని వర్గాలను ఇబ్బంది పెడుతున్న కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ చిన్నారులను సైతం ఉపేక్షించడం లేదు. ప్రభుత్వ తీరుతో అంగన్‌వాడీ చిన్నారులు వేసవిలో ఉక్కపోతతో విలవిల్లాడుతున్నారు. వేసవిలో అంగన్‌వాడీ కేంద్రాలకు సాధారణంగా సెలవులు మంజూరు చేస్తారు. రకరకాల యాప్‌లతో అంగన్‌వాడీ టీచర్లను నానా రకాలుగా ఇబ్బంది పెడుతున్న కూటమి ప్రభుత్వం తాజాగా ఉదయం 8 నుంచి 12 గంటల వరకు ఒంటిపూట బడి పెట్టుకోవాలని, టీచర్లు, ఆయాలు తప్పనిసరిగా సాయంత్రం నాలుగు గంటల వరకూ కేంద్రాల్లోనే ఉండాలని ఉత్తర్వులు జారీ చేసింది. మండలంలో 68 కేంద్రాల్లో దాదాపు 1,600 మంది చిన్నారులు, 136 మంది వర్కర్లు ఇబ్బందులు పడుతున్నారు

ధర్నా చేసినందుకే కక్ష సాధింపు

రెండు నెలల కిందట జీతాల పెంపుతోపాటు పెండింగ్‌లో ఉన్న బకాయిలపై అంగన్‌వాడీలు ప్రభుత్వంపై ఆందోళనకు దిగారు. అప్పట్లో ప్రభుత్వం మాట లెక్కచేయకుండా చలో విజయవాడ పేరుతో వేలాది మందితో భారీ ధర్నా చేపట్టారు. దీన్ని సీరియస్‌గా తీసుకున్న కూటమి ప్రభుత్వం జీతాలు పెంచకపోగా వేసవి సెలవులు కూడా ఇవ్వకుండా కక్ష తీర్చుకుంటోందనే వాదన వినిపిస్తోంది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యార్థులకు ఒంటిపూట బడి, ఆయాలు, అంగన్‌వాడీలు సాయంత్రం 4 గంటల వరకు కేంద్రాల్లోనే ఉండాలనే ఆదేశాలు జారీచేయడంపై వారు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

గర్భిణులు, బాలింతలకు తప్పని ఇబ్బందులు

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించిన ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల విషయంలో కక్ష సాధింపుగా వ్యవహరించడం విడ్డూరంగా ఉంది. వేసవి సెలవులు ప్రకటించకపోవడంతో గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా కేంద్రాలకు వెళ్లాల్సి ఉంది. ఎండలో ఉక్కపోత కారణంగా గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారు. చిన్నారులయితే ఉక్కపోత తాళలేక ఏడుస్తుండడంతో వారిని సముదాయించలేక ఆయాలు నానా తంటాలు పడుతున్నారు. చిన్నారుల ఇబ్బందిపై ప్రభుత్వం కనికరించాలని పలువురు కోరుతున్నారు.

సర్వేల్లో అంగన్‌వాడీలు

కిశోర వికాసం పేరుతో వారానికి రెండు రోజులు సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అంగన్‌వాడీలు వారి సెంటర్ల పరిధిలోని కిశోర బాలికలను సర్వే చేయాలి. సచివాలయ పరిధిల్లోని ఏఎన్ఎంలు, ఎంఎస్కేలతో కలిసి ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రాపవుట్, బాల్య వివాహాలపై నష్టాలు, వారికి పుట్టే బిడ్డల అనారోగ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించాలి. ఎండలు తీవ్ర ప్రభావం చూపే మే నెలలో మొత్తం సమావేశాలు నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేయడంపై వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమం మంచిదే అయినప్పటికి వేసవిలో సెలవులు లేకుండా చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తక్షణం అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ఇవ్వాలని కోరుతున్నారు.

సెలవులు ప్రకటించాలి



మండుతున్న ఎండల్లో చిన్నారులను అంగన్‌వాడీల్లో ఉంచడం దారుణం. చిన్నారులను 12 గంటల వరకు అంగన్‌వాడీలు, ఆయాలను సాయంత్రం 4 గంటల వరకు కేంద్రాల్లోనే ఉండమనడం ఇబ్బందికరం. అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా సెలవులు ప్రకటించాలి.

– పఠాన్ నాగుల్‌మీరా, మండల కోఆప్షన్ సభ్యుడు

కక్ష సాధింపు మానుకోవాలి



సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గతంలో అంగన్‌వాడీ వర్కర్లు ధర్నా చేసిన కారణంగానే ప్రభుత్వం సెలవులు మంజూరు చేయడంలేదు. ప్రభుత్వం వారిపై కక్ష సాధింపు చర్యలకు పూనుకుంది. చిరుద్యోగులపై కక్ష సాధింపు చర్యలు సరికాదు. చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వేసవి సెలవులు ప్రకటించాలి.

– గొల్లపూడి ప్రసాద్, ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి

వైఎస్సార్ సీపీ బలోపేతమే లక్ష్యం

మాజీ మంత్రి జోగి రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న జోగి రమేష్

ఇబ్రహీంపట్నం: గ్రామాల్లో క్షేత్ర స్థాయి నుంచి పార్టీ బలోపేతమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ అన్నారు. మైలవరం నియోజకవర్గ స్థాయి పార్టీ ముఖ్య నాయకుల సమావేశం బుధవారం రాత్రి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగన్ 2.0లో కార్యకర్తలకే అధిక ప్రాధాన్యం ఉంటుందని పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రకటన కార్యకర్తల్లో ఉత్సాహం నింపిందన్నారు. ప్రతి ఒక్క నాయకుడు పార్టీకి విధేయత కలిగి ఉండాలని సూచించారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం కొనసాగిద్దామన్నారు. కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, సహాయ కార్యదర్శి మేములకొండ తిరుపతిరావు, మేడపాటి నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రెంటపల్లి నాగరాజు, పట్టణ అధ్యక్షుడు పోరంకి శ్రీనివాసరాజు, వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

ముసునూరు: విద్యా హక్కు చట్టం ప్రకారం 2025–26 విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల్లో పేద పిల్లలకు 25 శాతం ఉచిత అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు గురువారం తెలిపారు. ప్రతికూల పరిస్థితుల్లో ఉన్న అనాథలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాల పిల్లలకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఒకటో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 2 నుంచి 19 వరకు అర్హత గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ముసునూరు మండల విద్యా శాఖాధికారి లేదా జిల్లా విద్యాశాఖాధికారిని సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ వెంకయ్య స్వామి టెంపుల్ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ పి. రవీంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయిపురం కాలనీ, సాహితీ విల్లాస్, వెంకయ్య స్వామి టెంపుల్ రోడ్డు, చెట్ల బజార్, ఎండోమెంట్ ఆఫీస్, బ్రాహ్మణ కార్పొరేషన్ ఆఫీస్, వాసవి ఫార్మా మార్కెట్ కాంప్లెక్స్, మురళి ఐస్ ప్లాంట్, నార్త్ ఫేస్ అపార్ట్‌మెంట్, లాంకో కాలనీ, జీజీహెచ్ స్కూల్, మురళీకృష్ణ టింబర్ డిపో ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

నేటి నుంచి ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరం

నూజివీడు: పట్టణంలోని విక్టోరియా టౌన్ హాల్ ఆవరణలో ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఈనెల 2 నుంచి 31 వరకు నిర్వహిస్తామని బాస్కెట్‌బాల్ కోచ్ వాకా నాగరాజు గురువారం తెలిపారు. బాస్కెట్‌బాల్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్‌లలో శిక్షణ ఇస్తామని చెప్పారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు శిక్షణ శిబిరం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ శిక్షణ శిబిరంలో పాల్గొనవచ్చన్నారు.

తాపీ వర్కర్స్ యూనియన్ కార్యాలయం ప్రారంభం

విస్సన్నపేట: కార్మికులు తమ హక్కుల సాధనకు సంఘటితంగా పోరాడాలని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. విస్సన్నపేట బస్టాండు సెంటర్లో గురువారం తాపీ వర్కర్స్ యూనియన్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు.

మేడే స్ఫూర్తితో హక్కుల రక్షణకు ముందుకు..



తిరువూరులో పతాకావిష్కరణ చేస్తున్న స్వామిదాసు



కొండపల్లి ఐడీఏలో నినాదాలు చేస్తున్న డీవీ కృష్ణ, కార్మికులు



తిరువూరులో సీపీఎం ఆధ్వర్యంలో కార్మికుల ప్రదర్శన



నూజివీడులో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ, హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యకర్తలు

- మేడే వేడుకల్లో వక్తల పిలుపు
- వాడవాడలా మేడే వేడుకలు

నూజివీడు/మైలవరం/తిరువూరు: ఎందరో మహానుభావుల త్యాగాలతో సాధించుకున్న కార్మిక హక్కుల రక్షణకు మేడే స్ఫూర్తితో ఐక్యంగా ముందుకు సాగాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. కార్మికుల పండుగ మేడేను గురువారం నూజివీడు, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు పతాకాలను ఆవిష్కరించి మేడే ప్రాధాన్యతను వివరించారు.

- **ఇబ్రహీంపట్నం:** ప్రపంచ కార్మిక దినోత్సవం మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఇబ్రహీంపట్నంలో వివిధ కార్మిక సంఘాలు నిర్వహించిన ర్యాలీలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. కొండపల్లి ఐడీఏలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీవీ కృష్ణ కార్మిక జెండాను ఆవిష్కరించారు. కార్మికుల తిరుగుబాటుతో అప్పటి వరకు ఉన్న 12 గంటల పని విధానం 8 గంటలకు వచ్చిందని ఆయన తెలిపారు. పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. కొటికలపూడిలో సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్ జెండా ఎగురవేశారు. భవన నిర్మాణ కార్మికులు, ఆటో వర్కర్లు పాల్గొన్నారు. గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ బ్రాంచి కార్యదర్శి ఎంవీఎం నాగేశ్వరరావు జెండా ఎగురవేసి హక్కులు కోసం పోరాడి అసువులు బాసిన వారికి నివాళులర్పించారు. ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.
- **మైలవరం:** సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక అమరవీరుల స్థూపం వద్ద జెండా ఆవిష్కరించారు. మండలంలోని పార్టీ కార్యాలయం కార్మిక భవనం, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం, కనిమెర్ల పర్వతాపురం, పోరాటనగర్‌లో పార్టీ పతాకాలు ఆవిష్కరించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, మండల పార్టీ కార్యదర్శి బుద్దారపు వెంకట్రావు పాల్గొన్నారు.

వామపక్షాల ఆధ్వర్యంలో..

తిరువూరు: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను తిరువూరులో ఉభయ కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో వేర్వేరుగా నిర్వహించారు. సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలోని ఫ్యాక్టరీ సెంటర్ నుంచి రాజుపేట వరకు కార్మికులు ప్రదర్శన జరిపారు. పలు కూడళ్లలో అరుణ పతాకాలను ఆవిష్కరించారు. సీపీఎం, సీఐటీయూ నాయకులు గుళ్లపల్లి వెంకటరత్నం, మేకల నాగేంద్రప్రసాద్, ఆకుల రవి, సంజీవరావు, రవి, వెంకటేశ్వరరావు, పి. శ్రీనివాసరావు, ఎస్వీ భద్రం, నాగరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో బస్టాండు సెంటర్లోని సుంకర వీరభద్రరావు భవన్‌లో ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. పార్టీ నాయకులు తూము కృష్ణయ్య, ఉదయ్, సుబానీ, నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు.

ఎందరో కార్మికుల త్యాగ ఫలమే హక్కులు..

నూజివీడు: ఎందరో కార్మికుల త్యాగఫలితం, పోరాటాల వల్లనే నేడు కార్మికులకు అనేక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు అన్నారు. నూజివీడు పట్టణంలోని పెద్దగాంధీ బొమ్మ సెంటర్, ఏరియా ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయం, అమర్‌భవన్, ఆర్టీసీ బస్టాండ్, తుక్కులూరు రంగుల ఫ్యాక్టరీ తదితర ప్రాంతాల్లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం మేడే పతాకాలను ఎగురవేశారు. అనంతరం విస్సన్నపేట రోడ్డులోని ముఠా వర్కర్స్ యూనియన్ కార్యాలయం నుంచి వందలాది మంది రెడ్‌షర్ట్ కార్మికులతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు చాట్ల పుల్లారావు, తోట వెంకటరావు, వాకా రాంబాబు, కె. చంటి, లక్ష్మణరావు, బోను చంద్రరావు, బి. వెంకటేశ్వరరావు, అక్కినేని రాజా, ఒగ్గు ముఖర్జీ చలసాని వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో...

సీఐటీయూ, సీపీఎంల ఆధ్వర్యంలో 17 సెంటర్లలో మేడే పతాకాలను ఎగురవేశారు. సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు ఎస్ఆర్ హనుమాన్లు, కార్యదర్శి జి. రాజు, దేవదాసు, సురేంద్ర, సందీప్ పాల్గొన్నారు.

- **ముసునూరు:** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా గురువారం పలు గ్రామాల్లో కార్మిక నాయకులు పతాకాలను ఆవిష్కరించారు. ముసునూరులో జరిగిన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్, గుళ్లపూడిలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నేత వేముల బక్కయ్య పతాకావిష్కరణ చేశారు. గుడిపాడు, వేల్పుచర్ల, ముసునూరు, చెక్కపల్లి, రమణక్కపేటల్లో సీపీఐ, సీపీఐఎం, సీపీఐఎం లిబరేషన్ నేతలు, న్యూ ఫ్రెండ్స్, భగత్‌సింగ్, యువచైతన్య ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో ఆటో కార్మికులు జెండాలను ఎగురవేశారు.
- **ఆగిరిపల్లి:** ఆగిరిపల్లిలోని సీపీఎం కార్యాలయంలో, నెక్కలం గొల్లగూడెం కుశలవ కంపెనీ వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ, కార్మిక సంఘం నాయకులు మేడే వేడుకల్లో పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దుకై ఉద్యమం

మైలవరం: కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్స్ రద్దుకై మే డే స్ఫూర్తితో ఉద్యమిద్దామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ సుధాకర్ అన్నారు. అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం మే డే సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు, పంచాయతీ, ముఠా, ఆశ, అంగన్‌వాడీ, పెయింటింగ్, హాకర్స్, సివిల్ సప్లై, రైతు బజారు ముఠా, ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, మైలవరం, పుల్లూరు, చంద్రగూడెం, గణపవరం, వెల్వడం, మొరుసుమిల్లి, మంగాపురం తదితర గ్రామాల్లో జెండా ఆవిష్కరణలు చేశారు. నాయకులు టి. నరసింహారావు, శ్రీనివాసరావు, వాసు, స్వామిదాస్, వరప్రసాద్, వీరమ్మ, శివ, జ్యోతి పాల్గొన్నారు. గణపవరం గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద జరిగిన కార్యక్రమంలో నాయకులు జె. అనిల్ కుమార్, నరేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

- **తిరువూరురూరల్:** పెద్దవరం, సూరవరం గ్రామాల్లో గురువారం మేడే వేడుకలు జరిగాయి. సీపీఐ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

కార్మిక శక్తికి తిరుగులేదు..

తిరువూరు: ప్రపంచంలో అన్ని వ్యవస్థల కంటే కార్మిక వ్యవస్థ ఎంతో బలమైందని, కార్మికులు సంఘటితంగా ఉంటే సమస్యలు పరిష్కరించుకోవచ్చని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో తిరువూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికుల హక్కుల పరిరక్షణ పాలకుల బాధ్యత అని, దీర్ఘకాలంగా అమలులో ఉన్న చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇష్టానుసారం మార్పులు చేయడం తగదన్నారు. అసంఘటిత రంగం కార్మికులకు బీమా సదుపాయం, ఉపాధి హామీ, కుటుంబ సంక్షేమ పథకాలను సమగ్రంగా అమలు చేయాలని స్వామిదాసు కోరారు. వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షుడు యరదేశి రామారావు, తిరువూరు మండల, పట్టణ అధ్యక్షులు తాళ్ళూరి నవీన్, చలమాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, నగర పంచాయతీ వార్డు కౌన్సిలర్లు మోదుగు ప్రసాద్, పరసా శ్రీనివాసరావు, ఏరువ ప్రకాష్‌రెడ్డి, నాయకులు గత్తం నాగేశ్వరరావు, వెలుగోటి ఆదినారాయణ, కంచర్ల ముత్యప్రసాద్, రేగళ్ల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



మైలవరం సీపీఎం కార్యాలయం వద్ద జండా ఆవిష్కరించిన నాయకులు



నెక్కలం గొల్లగూడెంలో మేడే వేడుకల్లో పాల్గొన్న కార్మిక సంఘ నాయకులు



మున్సిపల్ కార్యాలయం వద్ద మేడే పతాకాన్ని ఎగురవేస్తున్న సీఐటీయూ నాయకులు



తిరువూరు సీపీఐ కార్యాలయంలో కార్మిక దినోత్సవం

మట్టి కోసం బరి తెగింపు

- చెరువులో నీటిని బయటకు వదిలిన అక్రమార్కులు
- వేసవిలో మూగజీవాలకు ఈ నీరే ఆధారం
- చిలుకులువారిగూడెం ముత్యాలమ్మ చెరువులో ఘటన

జి.కొండూరు: మట్టి తవ్వకాల కోసం అక్రమార్కులు బరి తెగిస్తున్నారు. రబీ సాగు అనంతరం చెరువుల్లో మిగిలి ఉన్న నీటినే గ్రామాలలో పశువులు, జీవాలకు తాగునీటిగా వినియోగిస్తుంటారు. ఇప్పుడు ఈ నీరే మట్టి మాఫియాకు అడ్డంకిగా మారింది. చెరువులలో ఉన్న కొద్దిపాటి నీటిని బయటకు తరలించి మట్టిని అక్రమ రవాణా చేసేందుకు అక్రమార్కులు పావులు కదుపుతున్నారు. చిలుకూరివారిగూడెం గ్రామ శివారులో 15 ఎకరాల విస్తీర్ణంలో ముత్యాలమ్మ చెరువు ఉంది. ఈ చెరువు కింద ఆయకట్టు 60 ఎకరాల వరకు ఉంది. ఈ చెరువులోని మట్టి ఇటుకల తయారీకి అనువుగా ఉంటుంది. దీనితో చెరువులో మట్టిని బట్టీలకు తరలించి సొమ్ము చేసుకునేందుకు అక్రమార్కులు వ్యూహం పన్నారు. ఈ క్రమంలో చెరువులో మట్టి తవ్వకాలకు నీరు అడ్డంకిగా మారడంతో గురువారం ఉదయం తూములు లేపి చెరువులో నీటిని బయటకు వదిలారు. చెరువులో నీరంతా ఖాళీగా ఉన్న వ్యవసాయ భూముల్లోకి చేరుకుంది.

నిందితులపై చర్యలు తీసుకోవాలి..

సమాచారం అందుకున్న స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు రైతులతో కలిసి వెళ్లి చెరువులో నీరు బయటకు వెళ్లకుండా తూములను దింపారు. అప్పటికే చెరువులో 80 శాతం నీరంతా బయటకు పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులో నీరు ఉంటే వేసవిలో పశువులకు, జీవాలకు తాగునీటికి ఇబ్బంది ఉండేది కాదన్నారు. చెరువులో మట్టిని తరలించేందుకే నీటిని బయటకు వదిలారని వారు ఆరోపించారు. తూములు లేపి నీటిని బయటకు వదిలిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. ఈ ఘటపై ఇగిగేషన్ ఏఈ రాజశేఖర్ మాట్లాడుతూ చెరువులో నీరు బయటకు వదిలిన ఘటనపై విచారణ జరపుతున్నామన్నారు.



ముత్యాలమ్మ చెరువు తూము నుంచి బయటకు వెళ్తున్న నీరు